క్లుప్తంగా

వడ్డాదిలో విశ్రాంతి భవనం ప్రారంభం



విశ్రాంతి భవనం ప్రారంభోత్సవంలో పాల్గొన్న జెడ్పీటీసీ, నాయకులు

బుచ్చెయ్యపేట : మేజర్ పంచాయతీ వడ్డాది కస్బా రోడ్డులో ఏర్పాటు చేసిన విశ్రాంతి భవనం జెడ్పీటీసీ దొండా రాంబాబు శనివారం ప్రారంభించారు. వడ్డాది కస్బా ఆర్ అండ్‌బీ రోడ్డులో జిల్లా పరిషత్ నిధులు సుమారు రూ.4 లక్షలతో విశ్రాంతి భవనం ఏర్పాటు చేశారు. ఈ భవనాన్ని జెడ్పీటీసీ ప్రారంభించగా వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, ఎంపీటీసీ కోరుకొండ లీలావతి రమణ నాయకులు గుమ్మిడి ప్రసాద్, శంకర్, సయ్యపురెడ్డి కొండబాబు, సత్యనారాయణ, తెప్పల నాగేష్, కేబుల్ ప్రసాద్ పాల్గొన్నారు.

ధ్యానంతో చదువులపై ఏకాగ్రత సాధ్యం



ధ్యానంలో పాల్గొన్న విద్యార్థులు

కె.కోటపాడు : విద్యార్థి దశ నుండే ధ్యానం చేయడం వల్ల ఎంతో మేలు కలుగుతుందని పిరమిడ్ మాస్టర్ ఓ.నాగ అప్పారావు తెలిపారు. చౌడువాడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శనివారం ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. ధ్యానం ద్వారా చదువులపై మరింత ఏకాగ్రత పొందవచ్చని తెలిపారు. వివిధ వయస్సుల వారు కొన్ని నిమిషాల పాటు ప్రతి రోజూ ధ్యానం చేసి శ్వాసపై ధ్యాస చూపితే ఆరోగ్యం కూడా కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా పోలమాంబ పండగ



పోలమాంబను దర్శించుకుంటున్న భక్తులు

మాకవరపాలెం: మండలంలోని శెట్టిపాలెం శివారు వెంకన్నపాలెంలో పోలమాంబ పండగ ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి స్థానికులు ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సర్పంచ్ అల్లు రామునాయుడు, స్థానిక పెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు బోడకొండమ్మ పండగ..

జి.కోడూరులో ఆదివారం బోడకొండమ్మ పండగ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పండగ సందర్భంగా మధ్యాహ్నం భారీ అన్నసమారాధన, అమ్మవారి ఊరేగింపులో కోలాటం ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకోవాలని కోరారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాబూరావు



బాధ్యతలు స్వీకరించిన బాబూరావు

గొలుగొండ : గొలుగొండ ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాబురావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో మేరీరోజ్‌ను జిల్లా కార్యాలయానికి బదిలీ చేశారు. దీంతో డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న బాబూరావుకు జిల్లా అధికారులు ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

డీఎస్సీలో దేవరాపల్లి అభ్యర్థుల సత్తా

దేవరాపల్లి : ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో మండలానికి చెందిన పలువురు ఎస్జీటీ కొలువుకు అర్హత సాధించారు. దేవరాపల్లికి చెందిన కాటపల్లి రవిశంకర్ 89.99 మార్కులు సాధించి విశాఖ జిల్లాలో ఓపెన్ కేటగిరిలో 23 వర్యాంకు సాధించాడు. ఎం.అలమండకు చెందిన కామిరెడ్డి రాధ, ఒకేసారి రెండు ఉద్యోగాలు సాధించింది. సివిల్ కానిస్టేబుల్‌తో పాటు,డీఎస్సీలో ఎస్జీటీ ఉద్యోగానికి ఎంపికై ంది. మారేపల్లికి చెందిన సియ్యాద్రి మంజీరా, శ్వేత, హిందీ పోస్టుకు అర్హత సాధించింది. నాగయ్యపేటకు చెందిన చుక్కా దుర్గారావు, పిజికల్ ఎడ్యేకేషనల్ ట్రైనర్‌గా అర్హత సాధించి పీఈటీ కొలువుకు అర్హత సాధించాడు. వారిని మండల ప్రజలు అభినందించారు.

మరమ్మతులకు నోచుకోని డైవర్షన్ రోడ్లు

- బీఎన్ రోడ్డులో తీరని అవస్థలు
- వడ్డాది,పేట గ్రామాల్లో డైవర్షన్ రోడ్లుకు గండ్లు
- పెద్దేరు,తాచేరు నదుల్లో నీరు తగ్గిన ప్రారంభం కాని పనులు
- మూడు జిల్లాల ప్రజలకు రవాణా ఆటంకాలు
- ప్రతిపాదనలు పంపించినా మంజూరు కాని నిధులు
- పట్టించుకోని పాలకులపై ప్రజల ఆగ్రహం



దెబ్బతిన్న వడ్డాది డైవర్షన్ రోడ్డు



కొట్టుకుపోయిన తాచేరు డైవర్షన్ రోడ్డు

బుచ్చెయ్యపేట : భీమునిపట్నం, నర్సీపట్నం(బీఎన్) రోడ్డులో ప్రయాణికుల కష్టాలు పాలకులకు, అధికారులకు పట్టడం లేదు. ప్రధాన రోడ్డులో వడ్డాది పెద్దేరు నదిపైన, విజయరామరాజుపేట తాచేరు నదిపై ఉన్న డైవర్షన్ రోడ్లు పది రోజుల కిందట కురిసిన వర్షాలకు గండ్లు పడి కొట్టుకుపోయాయి. పెద్దేరు, తాచేరు నదుల్లో నీటి ఉధృతి తగ్గి వారం రోజులైనా ఆర్అండ్‌బీ అధికారులు మరమ్మతు పనులు తిరిగి చేపట్టలేదు. ముఖ్యంగా చోడవరం, నర్సీపట్నం, విశాఖ, పాడేరు, అకాపల్లి, మాడుగులకు తిరిగే ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర వాహనాల రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వడ్డాది నుంచి విజయరామరాజుపేటకు కిలోమీటరు దూరం ఉంది. పేట గ్రామస్తులు నిత్యవసర వస్తువులకు రోజూ వడ్డాది జంక్షన్‌కు వచ్చి తమ వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తారు. తాచేరు డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోవడంతో పది కిలోమీటర్లు అదనంగా మంగళాపురం, వంటర్లపాలెం, ముకుందపురం మీదగా వడ్డాది వస్తున్నారు. రెండు వైపులా రెండు కిలోమీటర్లకు 20 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తుంది. నర్సీపట్నం నుంచి చోడవరం వెళ్లే ఆర్టీసీ బస్సులు వడ్డాది వరకు వచ్చి ఆగిపోతున్నాయి. చోడవరం వెళ్లే అవకాశం లేక గౌరీపట్నం మీదగా ఇరుకు రోడ్డులో నుంచి ఆటోలు ఇతర వాహనాలపై వెళ్లగా గంటల కొలది ట్రాఫిక్ జాంలో చిక్కుకుని నిత్యం వేలాది మంది ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అనకాపల్లి నుంచి మాడుగుల వెళ్లే ఆర్టీసీ బస్సులను బంగారుమెట్ట జంక్షన్ నుంచి బుచ్చెయ్యపేట, కుంద్రం మీదగా మళ్లించారు. పాడేరు, విశాఖ ఆర్టీసీ బస్సులను కోనాం రూటులో నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో పలు గ్రామాలకు చేరాల్సిన ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు సకాలంలో చేరికోలేక ఇరుకు రోడ్లు, ట్రాఫిక్ జాంలతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా అత్యవసర సమయంలో విశాఖ,అనకాపల్లి ఆస్పత్రులకు వెళ్లే రోగులతో పాటు రోజూ విధులకు హాజరయ్యే ఉద్యోగులు అత్యవసర పనులపై వెళ్లేవారు నరక యాతన పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పెద్దేరు, తాచేరు నదులు వద్ద గండ్లు పడగా అప్పటి ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ జిల్లా కలెక్టర్‌ను, ఆర్అండ్‌బీ అధికారులను తీసికొచ్చి యుద్ధ ప్రాతిపదికన డైవర్షన్ రోడ్లు ఏర్పాటు చేయించి ప్రజలకు రవాణా కష్టాలు తీర్చారు. ఇపుడు ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు నీటి ఉధృతి తగ్గిన వెంటనే డైవర్షన్ రోడ్డు పనులు చేస్తామని హామీ ఇచ్చినా పనులు ప్రారంభించకపోవడంపై పలు గ్రామాల ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూలిన వడ్డాది పెద్దేరు వంతెన, విజయరామరాజుపేట వంతెనల స్థానంలో కొత్త వంతెనల నిర్మాణం చేపట్టకపోగా కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన తరవాత ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదని ప్రజలు మండి పడుతున్నారు. తక్షణం పేట,వడ్డాది డైవర్షన్ రోడ్లు బాగు చేయించి సుఖ ప్రయాణం కల్పించాలని మూడు జిల్లాల ప్రజలు కోరుతున్నారు.



వాహనాలు వెళ్లకుండా వడ్డాది జంక్షన్‌లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన పోలీసులు

ప్రతిపాదనలు పంపించాం : ఆర్అండ్‌బీ జేఈ

దీనిపై చోడవరం ఆర్అండ్‌బీ జేఈ సత్య ప్రకాష్‌ను వివరణ కోరగా తాచేరు డైవర్షన్ రోడ్డు మరమ్మతులకు రూ.30 లక్షలు అంచనాలతో ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. మాడుగుల జేఈ సాయి శ్రీనివాస్‌ను వివరణ కోరగా వడ్డాది డైవర్షన్ రోడ్డుకు రూ, 13 లక్షలు మరమ్మతు పనులకు అంచనాలు పంపించామని, నిధులు మంజూరైన వెంటనే పనులు చేయిస్తామని అన్నారు.

మట్టి వినాయకులతో కాలుష్య రహితంగా ఉత్సవాలు



మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడుకు మట్టి విగ్రహాలు అందజేస్తున్న భారత నిర్మాణ సేవా ట్రస్టు సభ్యులు

మాడుగుల : రానున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో గాలి నీరు, కాలుష్యం జరగకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరు మట్టి వినాయక విగ్రహాలుకు పూజలు చేయాలని, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు అన్నారు.భారత నిర్మాణ సేవా ట్రస్టు సభ్యులు గౌరీపట్టపు మహేష్ కుమార్‌ఆధ్వర్యంలో సభ్యులు తారువా వెళ్లి మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు కుటుంబానికి మట్టి విగ్రహాలు అందజేశారు. గత 12 ఏళ్ల నుండి మాడుగుల మండలంలో వేలాది మట్టి విగ్రహాలు ఉచితంగా పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సీహెచ్.మధు, జాగాని ఈశ్వరరావు, పేలూరి క్రిష్ణ, కొప్పాక రాంకీ, చందు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



వ్యాక్సిన్ రూంను తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో వీరజ్యోతి

మాకవరపాలెం: సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో వీరజ్యోతి వైద్య సిబ్బందిని ఆదేశించారు. మాకవరపాలెం పీహెచ్‌సీని ఆమె శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్‌రూంతోపాటు వ్యాక్సిన్ రూంలను పరిశీలించారు. వైద్యాధికారులు సీతారామలక్ష్మి, శ్రీనివాసరావుతో సమీక్ష నిర్వహించారు. సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. జ్వరాలు అధికంగా ఉండే గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతోపాటు ఇంటింటి సర్వే చేయాలని ఆదేశించారు.

కలుషిత నీటితో అనారోగ్య సమస్యలు



గుల్లేపల్లిలో విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న డ్వామా పీడీ పూర్ణిమాదేవి

కె.కోటపాడు : పరిశరాల పరిశుభ్రత, చెట్లను నాటే కార్యక్రమాల నిర్వహణతో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని భావితరాలకు ఇవ్వవచ్చునని డ్వామా పీడీ ఆర్.పూర్ణిమాదేవి అన్నారు. మండలంలో గుల్లేపల్లి గ్రామంలో శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రాథమిక పాఠశాలలో హెచ్.ఎం ఎన్.వీరాంజనేయులతో కలిసి ఆమె మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో విద్యార్థులతో కలిసి పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బండారు దేముళ్ళు, ఎంపీటీసీ దేముడు బాబు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, ఎంఈవోలు సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు వీరాంజనేయులు, ఉపాధ్యాయిని నీలిమ పాల్గొన్నారు.

జి.కోడూరు క్వారీని రద్దు చేయాలి



ఆర్డీవో కార్యాలయం వద్ద నిరాహారదీక్షలు చేస్తున్న క్వారీ బాధితులు

నర్సీపట్నం:మాకవరపాలెం మండలం, జి.కోడూరు క్వారీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, బాధిత దళిత రైతులు ఆర్డీవో కార్యాలయం వద్ద నిరాహారదీక్షలు చేస్తున్నారు. ఈ దీక్షకు సీపీఎం మద్దతు తెలియజేసింది. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అడిగర్ల రాజు మాట్లాడుతూ 32 రోజులుగా ఆర్డీవో కార్యాలయం వద్ద దళితులు ఆందోళన చేస్తున్న, ఆర్డీవో బాధితులతో మాట్లాడి సమస్యను పరిష్కరించలేదన్నారు. బాధితుల ఆందోళన పట్ల ఆర్డీవో, మైనింగ్ అధికారులు ఇప్పటికైనా స్పందించాలన్నారు. ఆల్ ఇండియా బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి బొట్టా నాగరాజు, చిరంజీవి పాల్గొన్నారు.

పంతాలకు పోతే సమస్య పరిష్కరించలేం



ఫిర్యాదుదారులకు కౌన్సెలింగ్ చేస్తున్న మండల ప్రత్యేకాధికారి మంగవేణి, తహసీల్దార్ వేణుగోపాల్

నాతవరం : ప్రతి చిన్న విషయాలకు పంతాలకు పట్టింపులకు పోతే సమస్యలు పరిష్కరించలేమని మండల ప్రత్యేకాధికారి జి.మంగవేణి, తహసీల్దార్ ఎ, వేణుగోపాల్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పీజీఆర్ఎస్ ఫిర్యాదుదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఇరువర్గాలకు కౌన్సెలింగ్ ఇచ్చి గ్రామాలవారీగా ఫిర్యాదుదారులతో మాట్లాడారు. వ్యక్తిగత కక్షలతో చిన్న సమస్యను పెద్దది చేసుకుని కోర్టులకు పోతే ఆర్థికంగా దెబ్బతింటారన్నారు. ఫిర్యాదుదారుల్లో అధికంగా కుటుంబసభ్యుల నడుమో భూవివాదాలే అధికమన్నారు. నిబంధనలు అనుసరించి తాము క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి రికార్డులను బట్టి న్యాయం చేస్తామన్నారు. మర్రిపాలెం, నాతవరం, గునుపూడి, తాండవ, సరుగుడు, కె.వి.శరభవరం నుంచి అధికంగా పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంటు పార్థసారథి, పంచాయతీ విస్తరణాధికారి మూర్తిబాబు, హౌసింగ్ జేఈ జోగారావు, ఏఎస్ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే దుకాణాలు సీజ్



మాకవరపాలెంలో ఎరువుల గొడౌన్ తనిఖీ చేస్తున్న అధికారులు



కొత్తకోటలో ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఏవో రమేష్‌బాబు

మాకవరపాలెం : ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే షాపులు సీజ్ చేస్తామని మండల ప్రత్యేక అధికారి రామ్మోహన్‌రావు హెచ్చరించారు. కొండల అగ్రహారం, మాకవరపాలెంలో ఉన్న ఎరువుల దుకాణాలను శనివారం మండలస్థాయి అధికారులతో కలసి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి నిల్వలు సరిచూశారు. ఎంఆర్‌పి ప్రకారం ఎరువులను విక్రయించాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే రైతులు అధికారులకు ఫిర్యాదులు చేయాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ వెంకటరమణ, ఇన్‌చార్జ్ ఎంపీడీవో మేరీజోన్స్, ఏవో అప్పారావు, ఎస్ఐ దామోదర్‌నాయుడు పాల్గొన్నారు.

రావికమతం : క్రిమిసంహారక మందులు,ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే షాపుల లైసెన్స్‌లు రద్దు చేసి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి రమేష్‌బాబు హెచ్చరించారు. శనివారం కొత్తకోటలో పలు ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. స్టాక్ బుక్స్, ఈ పాస్ మిషన్, గ్రౌండ్ బాలెన్స్ రికార్డులను పరిశీలించారు. ఎరువులు అధిక ధరలకు అమ్మితే రైతులు ఫిర్యాదు చేస్తే విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎంఆర్‌పీ ఎరువులు విక్రయించాలి



కె.కోటపాడులో దుకాణాల్లో ధరల పట్టికలను పరిశీలిస్తున్న అధికారులు

కె.కోటపాడు : ఎరువుల దుకాణాల్లో నిర్ణీత ధరలకే ఎరువులు అమ్మకాలు జరపాలని తహసీల్దార్ భుజంగరావు, ఎంపీడీవో సాంబశివరావు ఆదేశించారు. కె.కోటపాడులో శనివారం ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి సోమశేఖర్‌తో కలిసి తనిఖీ చేశారు. యూరియా కృత్రిమ కొరతను సృష్టించరాదని హెచ్చరించారు.

నాతవరం : నిబంధనలు ఉల్లఘించి అధిక రేట్లకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని మండల ప్రత్యేకాధికారి జి. మంగవేణి అన్నారు. నాతవరం గన్నవరం మెట్ట వద్ద ఎరువుల దుకాణాలను తహసీల్దార్ వేణుగోపాల్ వ్యవసాయాధికారి సుగుణ తనిఖీలు చేశారు. రైతు సేవా కేంద్రాల్లో ఉన్న నిల్వలు పరిశీలించారు.



నాతవరం రైతు సేవా కేంద్రంలో ఎరువులను తనిఖీ చేస్తున్న అధికారులు

వినాయక ఉత్సవాల్లో జాగ్రత్తలు పాటించాలి



శరభవరంలో గ్రామస్థులతో సమావేశమైన ఎస్సై రామకృష్ణారావు

రోలుగుంట : వినాయక నిమజ్జనోత్సవాల్లో జాగ్రత్తలు పాటించాలని రోలుగుంట ఎస్ఐ పి.రామకృష్ణారావు తెలిపారు. శరభవరం గ్రామంలో శనివారం ఆయన గ్రామస్తులు, ఉత్సవ నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆయన విగ్రహాల ప్రతిష్ట, ఊరేగింపు, నిమజ్జనం చేసే సందర్భంలో తాసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గణేష్ మండపాల ఏర్పాటుకు ముందస్తు అనుమతి తీసుకోవాలని అన్నారు. అందు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు కోసం ఏ విధమైన రుసుము చెల్లించనవసరం లేదన్నారు. ఊరేగింపు, నిమజ్జనోత్సవంలో అశ్లీల నృత్యాలు ప్రదర్శించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు పంచాడ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కె.జె.పురంలో పంచాయతీ సిబ్బందికి సూచనలు చేస్తున్న మండల ప్రత్యేకాధికారి శివప్రసాదరావు



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీవో రమణ, కమిషనర్ సురేంద్ర

నర్సీపట్నం : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆర్డీవో వి.వి.రమణ పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పురపాలకశాఖ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. అబిద్‌సెంటర్‌లోని మానవహారంగా ఏర్పడి ప్రతి ఒక్కరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు పట్టణ ప్రజలు పురపాలకశాఖ అధికారులకు సంపూర్ణ సహకారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ జంపా సురేంద్ర, తహసీల్దార్ రామారావు, ఎస్ఐ రమేష్ సచివాలయ, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

మాడుగుల రూరల్ : గ్రామంలో వీధులన్నీ పరిశుభ్రంగా ఉండేలా ప్రతిరోజూ పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పంచాయతీ సిబ్బందిని మండల ప్రత్యేకాధికారి ఆర్.శివ ప్రసాదరావు ఆదేశించారు. కె.జె.పురం గ్రామంలో శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు పరిశీలించారు. ప్రజలు ఇళ్ల పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. మండల పరిషత్ ఏవో గోపాలరాజు, పంచాయతీ కార్యదర్శి నవీన్‌దొర పాల్గొన్నారు.

టంగుటూరికి ఘన నివాళులు



ప్రకాశం పంతులు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, వైఎస్సార్‌సీపీ టౌన్ అధ్యక్షుడు ఏకాశివ

నర్సీపట్నం:సైమన్ కమిషన్ వ్యతిరేక ఉద్యమానికి ఎదురు నిలిచిన గొప్ప నాయకుడు టంగుటూరి ప్రకాశం పంతులు అని వాకర్స్‌క్లబ్ ప్రతినిధి, విశ్రాంత ఎంఈవో జేఎస్ఎస్ నాగేశ్వరరావు అన్నారు. వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో టంగుటూరి జయంతిని నిర్వహించారు. ఎన్టీఆర్ స్టేడియంలోని ప్రకాశం పంతులు విగ్రహానికి క్లబ్ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిరుపేద కుటుంబంలో పుట్టిన ప్రకాశం పంతులు ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధనలో కీలకపాత్ర వహించారన్నారు. కార్యక్రమంలో ట్రెజరర్ అల్లు అప్పారావు, జాయింట్ కార్యదర్శి పిట్ల శ్రీనివాస్‌రావు, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గజ్జలమ్మ, న్యాయవాదులు రామునాయుడు, లోవరాజు పాల్గొన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి దమయంతి టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠకులు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పెదబొడ్డేపల్లి రోడ్డులోని వైఎస్సార్ ట్యాంక్ బండ్ వద్ద ఉన్న ప్రకాశం పంతులు విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకాశివ పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ప్రకాశం పంతులు విశేషమైన సేవలు అందించారని చైర్‌పర్సన్ కొనియాడారు. కౌన్సిలర్ బుల్లిదొర, కోఆప్షన్ సభ్యులు షేక్ రోజా, పార్టీ నాయకులు అప్పలనాయుడు, తమరాన శ్రీనివాసరావు, బేతిరెడ్డి విజయ్, కణిత వాసు, శ్రీనివాసరావు, వరలక్ష్మి పాల్గొన్నారు.



స్టేడియంలో ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాల వేస్తున్న వాకర్స్‌క్లబ్ సభ్యులు

పేకాట రాయుళ్లు అరెస్టు



పేకాట ఆడుతున్న నిందితులుతో రావికమతం ఎస్ఐ రఘువర్మ, సిబ్బంది

రావికమతం : మండలంలో కవ్వగుంట శివారు బుడ్డిబంద గ్రామానికి దగ్గరలో ఉన్న కొండ పక్కన శనివారం పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామని ఎస్ఐ రఘువర్మ తెలిపారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకొని వారి నుంచి 5,400 రూపాయలు నగదు,బైక్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసామని ఎస్ఐ తెలిపారు.

గంజాయి తరలింపుపై డ్రోన్‌తో నిఘా



డ్రోన్ ద్వారా గంజాయి తరలింపుపై నిఘా పెట్టిన ఎస్ఐ శ్రీనివాస్

రావికమతం : గంజాయి రవాణా,అసాంఘిక కార్యకలాపాలను పూర్తి స్థాయిలో నియంత్రించేందుకు పోలీసుశాఖ అవసరమైన చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో గంజాయి రవాణాను అరికట్టడానికి కొత్తకోట పోలీసులు చర్యలు చేపట్టారు. చీమలపాడు పంచాయతీలో గంజాయి రవాణా మార్గాలుగా గుర్తింపు పొందిన కల్యాణపులోవ, ములకలాపల్లి, తదితర గ్రామాల్లో శనివారం కొత్తకోట ఎస్ఐ శ్రీనివాస్ పోలీసు సిబ్బందితో కలిసి డ్రోన్ కేమెరా ద్వారా కాలిబాటలను గుర్తించేందుకు సర్వే చేశారు. కొత్తకోట పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి మార్గాలను డ్రోన్ ద్వారా గుర్తించి గంజాయి రవాణా కాలిబాటలను డ్రోన్ ద్వారా నియంత్రించడం జరుగుతుందని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.